కథ

# అమానుషం

**"పెద్దగా చదువుకున్నదీ లేదు. ఉన్నత కుటుంబంలో పుట్టిందీ లేదు. కట్నాల మీద కోరిక లేదు. కానుకల మీద ఆశ అంతకన్నా లేదు. తను చేసుకోబోయే అమ్మాయి మూగదనీ తెలుసు. ఆమెకు జీవితాన్నందించిన ఓ మానవత్వమున్న యువకుని కథే...మానవత్వం పరిమళించిన వేళ"**

అందంగా..అంతకన్నా..కవితాత్మకంగా వార్తలు విశ్లేషించడంలో ఆమెది అందె వేసిన చేయి. పెద్దగా అందగత్తె కాకపోయినా..అందమైన ఆహార్యం..అనువైన అలంకరణతో ఆమె ఆహ్లాదంగా టీవీ తెరపై కనిపిస్తుంది. కమ్మగా సంఘటనను వివరిస్తుంది కనుక..ఆమె న్యూస్ చదువుతుంటేనే పనులన్నీ ఆపివేసి ఆ అరగంట వార్తలు వినాల్సిందే.

"చూడండి! ఎంత చక్కగా చెబుతుందో.." నా శ్రీమతి వ్యాఖ్యానించింది.

"చక్కగా చెప్పడమే కాదు..చక్కని అలంకరణ..భారతీయత..తెలుగుదనం మూర్తీభవించిన ఆహార్యం..ఆహ్లాదంగా కనిపిస్తోంది కదూ!" ఆ ఏంకర్‌ను మెచ్చుకోలేకుండా ఉండలేకపోయాను.

"అవునండీ! చాలా బావుంది..చక్కగా వార్తలు చదువుతోంది" టీవీ స్క్రీన్‌పై దృష్టికేంద్రీకరించింది.

ఓ చిన్న పూరిగుడిసె. దాని ముందు కూర్చున్న భార్యాభర్తలు..వారికిద్దరు ఆడపిల్లలు. ఇద్దరు పిల్లలూ మూగవాళ్ళే!

భర్త ఒక్కడే మాట్లాడగలుగుతున్నాడు.

"ఆమెలో ఏం చూసి పెళ్ళి చేసుకున్నారు?" యాంకర్ ప్రశ్నిస్తున్నాడు.

"ఓ అభాగినికి చేయూతనివ్వాలనిపించింది. పెళ్ళి చేసుకున్నాను. మేముండే గుడిసె ఎదురు గుడిసె వారిది. ఎన్నో సంబంధాలొస్తున్నాయి. ఎవరూ ఆమెను చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. నేనే ఆమెకు జీవితాన్నిద్దామనుకున్నాను..అంతే!"

అతను వివాహం జరిగిన విషయం వివరిస్తున్నాడు.

"మీకు యింకో విషయం తెలియాలి? మాది కులాంతర వివాహం! నేను సుతారి పనికి వెళ్తుంటాను! ఇక్కడ ఆమె బుట్టలల్లుతూ వుంటుంది."

ఆ సీన్లన్నీ టీవీ తెరపై కనిపించాయి.

"పుట్టే పిల్లలు మూగవాళ్ళవుతారని తెలియదా!"

"తెలుసు. సగం మంది మామూలు వాళ్ళు కూడా ఉంటారని అనుకున్నా! కానీ యిద్దరు పిల్లలూ మూగవాళ్ళయిపోయారు!"

"మీరు సంతోషంగా వున్నారా?" భార్య, పిల్లల మొహాలు తెరపై కనిపించాయి. చాలా సంతోషంగా ఉన్నామని హావభావ ప్రకటనలు కనిపించాయి.

ఇంతలో మరో ఛానెల్‌లో మరో సంఘటన కనిపించింది.

దుబాయ్ షేక్‌కు కుమార్తెను అమ్ముకున్న ఓ కుటుంబం. షేక్ వదిలేసిన తరువాత తల్లిదండ్రులే ఆమెను గడప త్రొక్కనివ్వలేదు. నీకు నేను ఆశ్రయమిస్తానంటూ ఓ గుడ్డివాడు చేయూతనిస్తాడు. వారిద్దరికో బాబు!

"మీ సంసారం ఎలా ఉంది?" యాంకర్ ఇంటర్వ్యూ మొదలైంది.

"చాలా మంచిగా ఉంది. చచ్చిపోదామనుకున్న నాకు మా వారే ధైర్యం కలిగించారు. పెళ్ళి చేసుకున్నారు. ఆయన తనకు చేతనైన పని చేసి డబ్బు సంపాదిస్తారు. నేను కూలికి, పాచి పనికి వెళ్ళి కడుపు నింపుకుంటుంటాము" ఆమె మొహంలో ఎంత ఆత్మవిశ్వాసం!

"గుడ్డివాడయినా...కన్న తల్లిదండ్రులకంటే నయమే కదండీ" నా శ్రీమతి అతనిని అభినందించింది.

"అదేనే..మానవత్వమంటే! వాళ్ళు యింకో విషయం కూడా చెబుతారు..విను" ఆమె ధ్యాసను టీవీపైకి మరలించాను.

"మాది మతాంతర వివాహం. ఆమె ముస్లిమ్! నేను హిందువును" భర్త చెబుతున్నాడు. ఒడిలో ఆడుకుంటున్న కొడుకును చేతుల్తో తడుముతున్నాడు.

"మీరే పండగలు చేసుకుంటారు?" యాంకర్ ప్రశ్నించాడు.

"అన్ని పండగలూ చేసుకుంటాము. ఏరోజు పది రూపాయలుంటే, ఆరోజే మాకు పండగ" యిద్దరూ చిరునవ్వు నవ్వేశారు.

వేరే న్యూస్ ఐటమ్ రావడంతో మా ఆవిడ వేరే ఛానెల్ మార్చేసింది.

టెక్నాలజీ విపరీతంగా అభివృద్ధి చెందడంతో ఎలక్ట్రానిక్ రంగంలో ముఖ్యంగా మీడియా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చేశాయి. పన్నెండు గంటలు...పదహారు గంటల కార్యక్రమాల స్థానే ఇరవై నాలుగు గంటల నాన్‌స్టాప్ రన్నింగ్ కార్యక్రమాలు ప్రేక్షకులకు కనువిందు చేస్తున్నాయి.

ఓ ఛానెల్ రోజులో పది సీరియల్స్ ప్రసారం చేస్తుంటే..మరో ఛానెల్ పదిరకాల సినిమా ప్రోగ్రామ్‌లను ప్రసారం చేస్తుంది. ఒక ఛానెల్ పూర్తిగా మ్యూజిక్ బేస్డ్ నాన్‌స్టాప్ నాన్‌సెన్స్ చూపిస్తే..మరో ఛానెల్‌లో నిరంతర వార్తాకదంబం పేరుతోనో..మణిహారం పేరుతోనో న్యూస్ అందించడంతో అన్నింటికంటే ముందుంటుంది.

ప్రతీ ఛానెల్ తన ప్రత్యేకతను చాటుకోవాలని..అన్నింటికంటే ముందే తమ ఛానెల్ ఆ వార్తనో..వార్తావిశేషాన్నో..చిత్రసీమ సంరంభాన్నో..ప్రారంభోత్సవాన్నో..ప్రెస్‌మీట్‌నో చూపించేయాలని తహతహలాడుతోంది. తపన పడుతోంది. ఇరవై నాలుగు గంటల కాలాన్ని తమ కార్యక్రమాలతో పూర్తిగా నింపి...ప్రేక్షకుల్ని పని పాటలు చేసుకోనీకుండా ప్రగతివైపు కన్నెత్తి చూడనీకుండా చేయాలిగా! అందుకే ఓ ప్రత్యేకమైన టైం టేబిల్ సిద్ధం చేసుకుంటోంది.

క్షణక్షణానికి ముఖం మీద పడే జుట్టును వెనక్కి తీసుకునే యాంకర్లు...అసలు జడంటూ వేసుకోవడమే తెలియని అధునాతన ముఖాలు...తెలుగుతనమే తెలియని యాంకర్లు తమ చిత్ర విచిత్ర హావభావ విన్యాసాలతో..స్క్రీన్ అంతా నింపేస్తుంటే ఎవరికైనా మరుక్షణమే ఆ ఛానెల్ మార్చాలనిపిస్తోంది.


తెలుగు టీవీ స్క్రీన్‌పై ఇంగ్లీషు తప్పితే మాట్లాడలేని తెలుగు సినిమా హీరోయిన్‌లు..తెలుగు పలుకుకోసం బిత్తర చూపులు చూస్తుంటే..చిన్న తెలుగు డైలాగులు చెప్పడానికే తంటాలు పడుతుంటే నవ్వు వస్తోంది మన తెలుగు సినిమా దిగజారుడుతనానికి!

ఓ ప్రముఖునితో ఇంటర్వ్యూ అనో, ఓ తారతో ముఖాముఖీ అనో, ఓ రాజకీయ నాయకునితో చర్చ అనో...అనేక రకాలుగా ప్రోగ్రాములు వస్తున్నా మా యిద్దరినీ ఆకర్షించేవి న్యూస్ మాత్రమే! ఏఏ ఛానెల్లో ఎప్పుడెప్పుడు న్యూస్ ప్రసారం అవుతాయో మా ఆవిడకు కరతలామలకం!

కొంచెం తెలివితేటలున్న ఛానెల్..తాము న్యూస్ ప్రసారం చేసే సమయాన్ని జాగ్రత్తగా ఎంచుకుంటుంది. ఆ సమయంలో మిగిలిన ఛానెళ్ళల్లో ఎక్కడా న్యూస్ రాని సమయం చూసుకుంటుంది. అప్పుడు తమ ఛానెల్‌నే చూస్తారని అంచనా వేస్తుంది.

అన్ని కార్యక్రమాలలోకి 'న్యూస్ టైమ్' ఎక్కువమంది యిష్టపడతారు. స్థానిక, రాష్ట్ర, దేశ, విదేశాలలో నిత్యం జరిగే సంఘటనలకు సజీవ చిత్రీకరణే 'న్యూస్'. అందుకే

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**



ప్రతీ
ఛానెల్ ఆ విషయంలో పోటీ పడుతుంటాయ్!

ఆ సమయంలో ఓ ప్రముఖ వ్యక్తి యింటర్వ్యూ చేయబడుతున్నాడంటే- కనీసం అరడజను మైక్రో ఫోన్‌లు ఆయన నోటి ముందుంటాయి. ఓ పది టీవీ కెమెరాలు ఆయనను పిక్చరైజ్ చేస్తుంటాయి. ఆయనను ప్రశ్నిస్తుంటాయి. సమాధానాలు రాబట్టడానికి ప్రయత్నిస్తుంటాయి.

కొన్ని ప్రోగ్రామ్‌లు లైవ్‌లో వస్తుంటే మరీ తమాషాగా ఉంటుంది.

నడిచివెళ్ళే వ్యక్తుల వెంట పరిగెత్తే యాంకర్‌లు. వారితోబాటు పరుగులు తీసే కెమెరామెన్..ఆ వ్యక్తుల అభిప్రాయాలను రికార్డ్ చేయడానికి ఎంత తాపత్రయపడతారో అర్థమౌతుంది. ఒక్కోసారి రికార్డెడ్ సన్నివేశాలలో కూడా ఈ ఉరుకులూ పరుగులూ దర్శనమిస్తూనే వుంటాయి.

"ఇదిగో చూడండి! ఆ కుర్రవాడికి మెడిసిన్‌లో సీటు వచ్చింది. చదవడానికి డబ్బు లేదు. తండ్రి ఓ కాకా హోటల్ యజమాని. చూడండి. ఆ బాబును చూడండి"

సా
శ్రీమతి మాటలతో నేను ఈ లోకంలోకి వచ్చేశాను.

"కత్తులు, కత్తెరలు పట్టి ఆపరేషన్ చేయాల్సిన చేతులు కప్పులు కడుగుతున్న వైనం" టీవీ యాంకర్ చక్కని విశ్లేషణ యిస్తున్నాడు.

ఆ కుర్రవాడు..హోటల్లో కప్పులు కడుగుతున్న దృశ్యం..ఎంగిలి ప్లేట్లు శుభ్రం చేస్తున్న దృశ్యం. తెరపై కనిపించాయి. మరుక్షణం అతని ర్యాంక్ కార్డ్ విశదంగా చూపించబడింది.

అతని రాంక్ చూసి ఆశ్చర్యపోయాను.."నాలుగు వందల పై..చిల్లర"

"ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా..ఉన్న ఊళ్ళోన్నే గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో చదివి మెడిసిన్ సీటు సాధించిన ఈ సరస్వతీ పుత్రుని యింట 'లక్ష్మి' ఛాయలే కనిపించవు. దాతలెవరైనా చదివిస్తారేమోనని..ఆశతో ఎదురుచూస్తున్న ఆ కుర్రవాడి ఆశ నిరాశ కారాదని ఆశించుదాం" యాంకర్ ముగించాడు.

"ఆ కుర్రవాడిని ఎవరైనా చదివిస్తారంటారా పాపం" శ్రీమతి జాలిపడింది.

"ఎవరో ఒకరు తప్పకుండా ఆర్థిక సహాయం చేస్తారు. చదివిస్తారు. ఈ వార్త ఈ ఒక్క ఛానెల్‌లోనే కాదు అన్ని ఛానెళ్ళలో వస్తుంది. ఎవరో ఒకరు తప్పకుండా సహాయం చేస్తారు" నమ్మకంగా అన్నాను.

మరో ఐదు నిమిషాలు తరువాత ఆ యాంకర్ ప్రత్యేకమైన వార్త అందించాడు.

"ఇప్పుడే అందిన వార్త! మేము ఐదు నిమిషాల క్రితం ప్రసారం చేసిన 'కప్పులు కడుగుతున్న కత్తెరలు పట్టాల్సిన చేతులు' క్లిప్పింగ్ చూసి యిప్పుడే శ్రీ.....అతని చదువుకయ్యే ఖర్చంతా భరిస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త ముందుకొచ్చారు. వారికి మా టీవీ ఛానెల్ తరపున కృతజ్ఞతలు!"

"చూశావా! నేను చెప్పానా లేదా..ఇంతలోనే ఆ మహానుభావుడెవరో ఆదుకున్నారు. చదివిస్తానని హామీ యిచ్చారు" ఆనందం వ్యక్తపరిచా.

"మంచిదే కదండీ! అందరూ మన పిల్లల్లాంటి వాళ్ళే కదా! ఉద్యోగం చేస్తున్న మీరే పిల్లల్ని చదివించడానికి యిన్ని యిబ్బందులు పడుతుంటే...రోజువారీ పనులు చేసేవారూ..కూలికెళ్ళే వాళ్ళు..ఎలా చదివించగలరండీ" శ్రీమతి గొంతులో సానుభూతి.

**యం.సూర్యప్రసాదరావు**

"ప్రతిభావంతుడికి ఎప్పుడూ ఎవరో ఎక్కడో సహాయపడుతూనే వుంటారు. చక్కగా చదువుకునే వాడికి..కార్యం సాధించాలనుకునే వాడికి అడ్డంకులొచ్చినా..అవి తాత్కాలికమే! అటువంటివారు జీవితంలో తప్పకుండా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు!" నేనెరిగిన అనుభవం చెప్పాను.

"అంతేనంటారా?"

## కాశ్మీరాకి కోపం వచ్చింది!

**ఆమధ్య మనీషా కొయిరాలా తాను నటించని అశ్లీల సీన్లని మరో తారతో షూట్ చేసి తనకి చెడ్డపేరు తెచ్చాడని ఓ దర్శకుడిపై కేసు వేసినట్టే ఇప్పుడు మరో తార కాశ్మీరా షా కూడా 'రేవతి' అనే సినిమా చిత్ర నిర్మాతా దర్శకులపై కేసు పెడతానంటోంది. సినిమాకి అవసరం గనుక దర్శకుడిపై నమ్మకంతో తాను బ్యాక్ ఓపెన్‌గా అర్ధనగ్న స్నానఘట్టాన్ని ఒప్పుకుంటే దాన్ని తనకు తెలియకుండా వక్రీకరించి మరింత అశ్లీలంగా చిత్రీకరించి పబ్లిసిటీ చేస్తున్నారని దీన్ని నేనెంత మాత్రం సహించనని, సినిమా విడుదలని ఆపాలని కోర్టుకెళ్తానంటోంది. బాలీవుడ్‌లో ఇలాంటివన్నీ మామూలేనని పెదవి విరిచేస్తున్నారు ఇది విన్న సినీ పండితులు.**

"తప్పకుండా మేలే జరుగుతుంది. ఇతరులకు హాని తలపెట్టనివాడికి..చేతనైతే సహాయం మాత్రమే చేసే వారికి ఎవరో ఒకరు అండగా వస్తారు. వారి పని పూర్తిచేసి పెడతారు" అంటుండగానే..

"అటు చూడండి! ఎంతమంది..పిల్లలో! పాలుగారే పిల్లలు! ముద్దొచ్చే పిల్లలు..టీవీ స్క్రీన్‌పై ఎంత చక్కగా కనిపిస్తున్నారో చూడండి!" శ్రీమతి దృష్టిని టీవీపైకి మరల్చింది.

నిజమే! ఎందరు చిన్నారులో. నెలల వాళ్ళు..రెండు మూడు సంవత్సరాలలోపు వాళ్ళు..ఓ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రాంగణంలో తల్లిదండ్రులతో కనిపిస్తున్నారు. కెమెరామెన్ వాళ్ళను క్లోజప్‌లో చూపిస్తున్నాడు. యాంకర్ వారి క్షేమ సమాచారాలు అడుగుతున్నాడు.

పిల్లల తల్లులు చెబుతున్న విషయం విని నిర్ఘాంతపోయాం!

"ఎవరండీ..ఆ పిల్లలు? వాళ్ళకేమయిందండీ? అందరూ హాస్పిటల్లో ఉన్నారు" ఆమెకు వాళ్ళ వ్యాధి ఏమిటో తెలియలేదు.

"వాళ్ళందరూ హృద్రోగులే! గుండె సంబంధమైన జబ్బులున్న వాళ్ళే!" నేను వాళ్ళ వ్యాధి గురించి చెప్పాను.

"అంటే...అంత చిన్న వయసులోనే గుండె జబ్బులా?" ఆమె ఆశ్చర్యపోయింది.

"చిన్న గుండె జబ్బులు కావు. ఆపరేషన్ చేయాల్సిన జబ్బులు. ఆపరేషన్ చేయకపోతే వారు ఎక్కువ కాలం బ్రతకరు! ఆపరేషన్‌కు ఎంతవుతుందో తెలుసా కనీసం..లక్ష రూపాయలు!"

"అమ్మో లక్ష రూపాయలే! ఎలా తెస్తారండీ! వాళ్ళను చూస్తుంటే చాలా పేదవారిలా ఉన్నారే!"

"అంతా పేదవారేనే! అందుకే వాళ్ళను టీవీలో చూపిస్తున్నారు. ఆ హాస్పిటల్ వాళ్ళు ఖర్చు తక్కుతే ఆపరేషన్ చేస్తామంటున్నారు. దాతలెవరైనా ముందుకు వస్తే...ఆర్థిక సహాయం అందిస్తే..సబ్సిడీ పద్ధతిలో వాళ్ళకు ఆపరేషన్ చేయటానికి అవకాశముందని..విరాళాలను ఆ టీవీ ఛానెల్ పేరిటగానీ..హాస్పిటల్ పేరిటగానీ పంపించమని విజ్ఞప్తి చేస్తున్నారు"



"అసలు అంత చిన్న వయసులో..గుండెజబ్బులెలా వస్తాయండీ?"

"అవి..పుట్టుకతోనే వచ్చే జబ్బులన్నమాట! వీటిని కేవలం ఆపరేషన్ ద్వారా మాత్రమే సరిచేయగలం. అంటే..గుండెలో ఉండే కవాటాలు సరిగా పనిచేయకపోవడం, రక్తప్రసరణ సరిగ్గా లేకపోవడమే యీ వ్యాధి లక్షణాలు" నేను చెబుతుండగానే-

"అలా చూడండి! ఛానెల్‌లో క్రింద స్క్రోలింగ్ వస్తోంది. చూడండి..చూడండి!"

ఆమె మాటలతో నేను కూడా స్క్రీన్‌పై పరిశీలించా.

చిన్న పిల్లల గుండె జబ్బుల నివారణ నిమిత్తం అప్పుడే యిద్దరు ముగ్గురు విరాళాలు ప్రకటించేశారు. ఎవరు..ఎవరు ఎంత విరాళం యిస్తున్నారో వివరంగా వస్తున్నాయి. మరో పది నిమిషాల్లో విరాళాల వెల్లువ వచ్చేసింది.

అప్పుడు అక్కడి డాక్టర్లతో యింటర్వ్యూ మొదలైంది.

విరాళాలు వస్తున్నాయి కనుక..పిల్లలకున్న గుండె జబ్బుల తీవ్రత బట్టి ఒకరి తరువాత మరొకరికి ఆపరేషన్లు చేస్తామని ప్రకటించారు.

"చూశావా! నేను చెప్పానా లేదా! మానవత్వం యింకా మాసిపోలేదే! 'మానవ సేవే మాధవ సేవ' అనుకునే వాళ్ళు చాలామంది ఉన్నారు. లేకపోతే..యింత మంది చిన్నపిల్లలు ఎలా బ్రతికి బయట పడాలి! వాళ్ళంతా ఆ టీవీ ఛానెల్..ఆ హాస్పిటల్‌కు రుణపడి ఉండాలే!" నా గొంతులో ఆనందం తొణికిసలాడింది.

ఇంతలో ఆ ఛానెల్‌లో ప్రకటనలు మొదలవడంతో ఛానెల్ మారిపోయింది.

ఓ హాస్పిటల్ ముందు..తమ అభిమాన హీరో ఆరోగ్యంగా ఉండాలని...అతన్ని అరెస్ట్ చేయరాదనీ ధర్నా చేస్తున్న వీరాభిమానుల కోలాహలం కనబడుతోంది.

"అతన్ని విడుదల చేయకపోతే మేం ఆత్మహత్యలు చేసుకుంటాం" ఒకరి తరువాత మరొక అభిమానులు నినాదాలిస్తున్నారు.

వారెక్కడ అఘాయిత్యం చేసుకుంటారోనని వేయికనులతో కాపలా కాస్తున్న పోలీసులు! మొత్తం దృశ్యాన్ని 'లైవ్'లో చూపిస్తున్న టీవీ ఛానెళ్ళు!

ఇంతలో ఒక వీరాభిమాని అనుకున్నంత పని చేశాడు.

తలపై పెట్రోలు పోసుకోవడం చూసి టీవీ కెమెరాలు, యాంకర్లు అటువైపు పరిగెత్తారు. "ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నారు?" ఒకరడిగారు.

"నా అభిమాన హీరోను బేషరతుగా విడుదల చేయాలి! చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటాను" వీరాభిమాని అన్నాడు.

"ఆత్మహత్యే పరిష్కారమని అనుకుంటున్నారా?"

"నా ఆత్మహత్యతోనైనా ప్రజలు కళ్ళు తెరుస్తారు! నా హీరో విడుదలౌతాడు"

"మరి..మిమ్మల్ని నమ్ముకున్న మీ తల్లిదండ్రులు"

"వాళ్ళకంటే నాకు నా హీరోనే ముఖ్యం! ఆయనకోసం ప్రాణమైనా అర్పిస్తాను"

ఈలోగా యింకో అభిమాని అగ్గిపెట్టె అంటించాడు. అతడూ మరో వీరాభిమానే! అగ్గిపుల్ల తెచ్చేలోపు..మెరుపుల్లా దూరం నుండి చూస్తున్న పోలీసులు అతడిని చుట్టుముట్టారు.

"జీవితమంటే...అంత చౌకగా ఉందట్రా! నిన్ను నమ్ముకున్న వాళ్ళను అన్యాయం చేసి చావటానికట్రా నిన్ను కన్నదీ..పెంచిందీ! జీవితమున్నది నూరేళ్ళూ బ్రతకటానికిరా!" సమయస్ఫూర్తిగా ప్రవర్తించిన యస్పీ లేకపోతే అతను ఆహుతైపోయేవాడే!

మిగిలిన పోలీసులు అతని బట్టలు వేరు చేసి..అరెస్ట్ చేస్తుంటే..పోలీసు వ్యాన్ ఎక్కిస్తుంటే మళ్ళీ యాంకర్‌లు అతని దగ్గరకు పరిగెత్తారు.

"ఏనాటికైనా..జీవితాశయం సాధిస్తాను! నా అభిమాన హీరోకోసం ప్రాణం అయినా అర్పిస్తాను"

"అర్పిద్దువుగానీరా! ఆత్మహత్యానేరం క్రింద నిన్ను అరెస్ట్ చేస్తున్నాం! ఎక్కించండిరా వీడిని వ్యాన్‌లోకి...అక్కడ అర్పిద్దువుగానీ ఏమి అర్పిస్తావో" ఎస్.పి.హెచ్చరించి వ్యాన్‌లోకి తోశాడు.

"ఇంకా నయం! మరో రెండు నిమిషాలు వాళ్ళు ఇంటర్వ్యూ చేసి వుంటే అబ్బాయి ప్రాణాలు గాలిలో కలిసిపోయేవే!" నా శ్రీమతి భయం ప్రకటించింది.

నాకూ నిజమేననిపించింది! ఇంటర్వ్యూ పేరుతో మరీ యింత హింసించకూడదుగా!

ఆ ఛానెల్‌లో వార్తలు అయిపోగానే మరో ఛానెల్ న్యూస్ హెడ్‌లైన్స్‌లోకి వెళ్ళిపోయాం.

"ఆత్మహత్య చేసుకోబోతున్న ఓ వ్యక్తిని..పురుగుమందు తాగిన ఓ వ్యక్తిని మృత్యువుకు అప్పగించిన ఇంటర్వ్యూ వైనం" ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేయడం ప్రారంభించింది.

అతను ఓ కార్ డ్రైవర్! సెకండ్ హేండ్ కారు కొనుక్కున్నాడు. ఓనర్‌కు డబ్బు అంతా యిచ్చి నీ బుక్ యివ్వమన్నాడు. ఓనర్ యివ్వలేదు సరిగదా..సదరు డ్రైవర్‌పై పోలీస్ కంప్లెయింట్ యిచ్చాడు. దానితో కారు పోయింది. డబ్బు పోయింది. ఉద్యోగం పోయింది. కలెక్టర్‌గారికి విన్నవించుకొని న్యాయం చేయమని కలెక్టర్ ఆఫీసుకు వచ్చాడు. అక్కడికి పురుగుమందు టిన్ తెచ్చుకున్నాడు. వివరాలు తెలుసుకున్న ఓ టీవీ ఛానెల్ అతన్ని ఇంటర్వ్యూ చేస్తోంది.




"కలెక్టర్‌గారేమన్నారు?"

"ఆయన్ని కలవనీయడానికి సిబ్బంది వీలుపడదన్నారు"

"ఆయన్ని కలవకపోతే..ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించా. వాళ్ళు చలించలేదు. అంతే పురుగుమందు త్రాగేశా"

పురుగుమందు తాలూకు చారికలు అతని ముఖంపై బట్టలపై కూర్చున్న మెట్లపై కనిపిస్తున్నాయి.

"ఎందుకిలా చేయవలసి వచ్చింది?"

"నా జీవనాధారం పోయింది. ఇంక జీవించి ఉపయోగమేముంది?"


యాంకర్ యింకా ఏవేవో ప్రశ్నలు వేస్తున్నాడు.

"అయ్యో! అతడిని హాస్పిటల్‌లో చేర్పించవచ్చుగదా!" ఆమె ఆందోళన ప్రకటించింది.

"ఎవరు చేర్పిస్తారే ! అందరూ అతన్ని కెమేరాలతో, మైకులతో ముట్టడిస్తుంటే" మేము జరిగిన సంఘటన చూస్తూనే వున్నాం.

అప్పటికి పది నిమిషాలైంది.

ఇంతలో ఆఫీసు స్టాఫ్ ఎవరో గబగబా అతన్ని ఎత్తుకొని ఎదురుగానున్న గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకుపోయారు.




అతని వెనకే టీవీ కెమేరాలు, ఫోన్లూ పరుగులు తీశాయి.

"ఇప్పటికే చాలా లేటయింది. త్రాగి చాలా సేపయి వుంటుంది. బ్రతకడం కష్టమే! అయినా మా వంతు ప్రయత్నిస్తాం"

డాక్టర్లు తమ ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నం కూడా టీవీ తెరపై కనిపించింది.

నాలుగైదు నిమిషాలు గిలగిలా కొట్టుకున్నాడు. ప్రాణాలు విడిచాడు.

"అయ్యో పాపం! ముందుగా హాస్పిటల్‌కు తీసుకువెళ్తే బ్రతికేవాడేమో!" ఆవేదనగా అంది.

"నిజమేనే! ఇంటర్వ్యూ ఓ నిండుప్రాణాన్ని బలిగొంది" బాధగా అన్నా.

"ఇది అమానుషం. ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని..పురుగుమందు త్రాగిన వ్యక్తిని..ఇంటర్వ్యూ చేయడంలో ప్రదర్శించిన సిన్సియారిటీ..అతడిని రక్షించడంలో ఆ టీవీ సిబ్బంది చూపించి ఉంటే..అతను బ్రతికి ఉండేవాడు. కనీసం వెంటనే రోడ్డుకు అవతలనున్న హాస్పిటల్‌కు పట్టుకు వెళ్ళినా అతను జీవించేవాడు. అమితోత్సాహం అయిపోయిన తరువాత..హాస్పిటల్‌లో చేర్పిస్తే..బ్రతికే కాలాన్ని కుదించి వేసిన ఆ 'అత్యుత్సాహ' సిబ్బంది చూపించింది మానుషమా..అమానుషమా..మీరే నిర్ణయించండి. విజ్ఞత కలిగిన ప్రేక్షకులకే..ఆ నిర్ణయాధికారం వదలి వేస్తూ మీ.." టీ.వీ.యాంకర్ పూర్తి చేశాడు.

మా యిద్దరి మనసులు మూగపోయాయి. చూస్తుండగానే ఓ ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఆత్మహత్యలు కొనసాగుతున్న తరుణంలో..బెదిరింపులుగా ఆత్మహత్యా ప్రయత్నాలు విజృంభిస్తున్న యీ సమయంలో ఎవరు ఈ ఘోరకలిని ఆపేది? మరణానికి దగ్గరౌతున్న ఆ అభాగ్యులను ఎవరు రక్షించేది?

మానవత్వం పరిమళించిన వేళలంటూ చూపిస్తున్న టీవీ ఛానెళ్ళే.. ఈ అమానుష కార్యక్రమాలకై అతి చొరవ చూపకుంటే...బాగుంటుందేమో!

ఆ మాటే శ్రీమతితో అంటే..

"నిజమేనండీ! వందమంది అపరాధులు తప్పించుకోవచ్చు. కానీ ఓ నిరపరాధి మాత్రం బలికాకూడదు" నా అభిప్రాయాన్ని అనుసరించింది.

వెంటనే అనకుండా ఉండలేకపోయాను.

"అతి సర్వత్రా వర్జయేత్!"